సంపుటి: 12 | సంచిక: 4

మే - జూన్ 2024

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



“గోధుమగింజ భూమిలో పడి...
చచ్చిన యెడల విస్తారముగా ఫలించును”.

యోహాను 12:24



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవునియందు ప్రియులైన స్పర్శ పాఠకులకు శుభములు. మీరంతా బాగున్నారని నేను భావిస్తున్నాను. దేవుడు ఆయన కృపచేత మనందరిని గత కాలమంతా కాపాడి, సంరక్షించి, ఈ దుర్దినాలలో దేవునియందలి విశ్వాసాన్ని, ఆయన రాకడ కొరకు ఒక నిరీక్షణని అనుగ్రహించారు. విలువలతో కూడిన క్రైస్తవవిశ్వాస ప్రయాణం కొదువైపోతున్న కాలంలో మీరంతా విలువలతో కూడిన ఆత్మీయ ప్రయాణాన్ని కొనసాగించాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. నేను దేవునిని నమ్ముకున్నాను, ఆ రక్షణ భాగ్యం నాకు కలిగింది అని మనం ధైర్యంగా చెప్పవలసినవారమై ఉన్నాము. ఎందరికో ఈ ధైర్యం లేదు కారణం అలవాటుగా ఆచారంగా క్రీస్తును వెంబడించడం జరుగుతుంది. మీరు, మీ కుటుంబాలు, దేవుడు మీకిచ్చిన పిల్లలు ప్రభువైన యేసుక్రీస్తును వెంబడించుట అంటే నిజమైన మారుమనస్సు పొంది, రక్షించబడి, ఈ లోకంలో ఆయన వాక్యప్రకారం నడుచుకుంటూ, రాకడకొరకు ఎదురుచూస్తూ జీవించుట అని స్పష్టంగా గ్రహించి ముందుకుసాగాలి. ఎంతోమందికి ఈ జ్ఞానం లేదు బోధలు కూడా పూర్తిగా కలుషితమైన నేటి పరిస్థితుల్లో విశ్వాసానికి కర్తయు దానిని కొనసాగించువాడైన యేసువైపు చూస్తూ ఈ పరుగు పందెములో ఓపికతో పరుగెత్తుదుము అని హెబ్రీ గ్రంథంలో వ్రాయబడినట్లు, ఎంతో ఓపికతో ఆత్మీయ ప్రయాణాన్ని కొనసాగించడం అవసరం. అది లేకపోతే వారు ఇలా, వీళ్ళు అలా ఉన్నారు కదా అని మనం కూడా రాజీపడి, దేవుని వాక్యం ప్రక్కన పెట్టి, మన సొంత ఇష్టాల్ని నెరవేర్చుకోవడానికి ఎంతగానో అవకాశం ఉంది. కానీ ఈ స్పర్శ ద్విమాస పత్రిక చదువుతున్న ప్రతి ఒక్కరికి దేవుని ప్రేమతో బ్రతిమిలాడి చెప్పేదేమిటంటే మీరు రాజీపడి, వాక్యమును ప్రక్కనపెట్టి, జీవించవద్దని మనవి చేస్తున్నాను. అలా జీవించుట ఆత్మీయంగా మరణంతో సమానం, ఆత్మీయ మరణాన్ని గనుక మనం పొందితే, దేవుని రాజ్యాన్ని మనం పోగొట్టుకుంటాము. ఒకడు లోకమంతా సంపాదించుకొని తన ఆత్మ దేవుని రాజ్యానికి చేరకుండా నష్టపోతే ఏం ప్రయోజనం? ఏ ప్రయోజనమూ ఉండదు కనుక ప్రతి ఒక్కరూ గమ్యానికి చేరుకోవాలనే శ్రద్ధతో, ఈ లోకంలో ఉన్న పరిస్థితులన్నింటిలో కూడా ఓపికతో ప్రభువుని వెంబడించమని మనవి చేస్తున్నాను.

ఇట్టి భాగ్యాన్ని ప్రభువు దయచేయును గాక.

మీ సహోదరుడు.....



సంపుటి: 12 | సంచిక: 4

మే - జూన్, 2024

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- గోధుమగింజ ... 2
- హతసాక్షులు ... 6
- ధైర్యం(స్త్రీల ప్రత్యేకం) ... 9
- జాన్ వెస్లీ -26వ భాగం ... 12
- పిల్లలు-పెద్దలు(బాలలశీర్షిక) ... 14
- నా జీవితంలో దేవుడు చేసిన మేలులు ... 16
- ఆరోగ్యం ... 18
- మనస్థత్వ విధానాలు ... 20
- దైవచిత్తాన్వేషణ ... 22
- Finding God`s Will(english) ... 24
- బైబిల్ క్విజ్ -94 ... 26
- జన్మదిన శుభాకాంక్షలు ... 27


మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్ట్యాంక్ ఎదురుగా,

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227

# గోధుమగింజ

బ్రదర్. ఎపఫ్రా



**"గోధుమగింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును; అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును". యోహాను 12:24**

**"తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును; ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవముకొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఒకడు నన్ను సేవించినయెడల నన్ను వెంబడింపవలెను; అప్పుడు నేను ఎక్కడ ఉందునో అక్కడ నా సేవకుడును ఉండును; ఒకడు నన్ను సేవించినయెడల నా తండ్రి అతని ఘనపరచును". యోహాను 12 25,26**

గోధుమగింజ భూమిలో పడిపోయి చనిపోవడం అనే మాట ఎంతో లోతైన అర్ధమును కలిగి ఉంది.

మొట్టమొదట యేసయ్య ఈ విషయమును తన శిష్యులతో చెప్పడానికి కారణం అది ఆయన మరణానికి అప్పగింపబడుతున్న సమయం గనుక వారు చాలా కృంగిపోయి నిరాశ లోకి వెళ్లారు. అందుకే ఆయన మీరు అధైర్యపడకండి, నేను చనిపోతేనే కాని నిజమైన ఆశీర్వాదం, దేవుని పని ప్రారంభం కాదు అని ఆయన కొరకు మాత్రమేకాక, మనకొరకు కూడ ఈ అంశమును ఉంచాడు. అంటే మనం ఎప్పటికి స్వార్ధం, గర్వంతో ఉంటే ఒంటరి గానే ఉండిపోతాము. మనలో నేను అనే స్వభావం(స్వార్ధం), గర్వం ఎప్పుడైతే చచ్చిపో తాయో, అప్పుడు బహుగా ఫలించడం ప్రారంభిస్తాము. గోధుమగింజ పనికిరానిది కాదు పనికి వచ్చేదే, దానిలో కూడా జీవం ఉంది కానీ అది తన స్థానాన్ని, స్థితిని, స్వభావాన్ని మార్చుకొని, భూమిలో పడి చనిపోయి, ఫలించడం ప్రారంభిస్తుంది. మనలో ఉన్న అహం, స్వార్ధం, అసూయ, ఘనతను ఆశించే మనస్సు చావాలి, అదే గోధుమగింజ భూమిలో పడి చనిపోవ డమంటే. అలాంటి వారు గుర్తింపులను, గౌరవములను కోరుకోక తమ జీవితాన్ని త్యాగం చేయడానికి ముందుకు వస్తారు. ఇవేవి లేకుండా అద్భుతంగా పాటలు పాడవచ్చు, ప్రసంగాలు చేయవచ్చు, పరిచర్య పనులలో భాగస్థులుగా కూడా అవ్వవచ్చు. కాని మన జీవితంలో తగ్గించుకోవడమనేది మాత్రం దేవుని యొక్క సహాయంతో, ఆయనకు లోబడితే తప్ప సాధ్యం కాదు. సమయపాలన విషయంలో, ధనాన్ని వ్యయపరిచే విషయంలో ఆసక్తి కలిగి ఉండటం గొప్ప విషయం కాదు కారణం దేవునిని నమ్మని వారిలో కూడ చాలామంది

ఈ విషయాలలో ఆసక్తిగా ఉంటారు. గుర్తింపును, ఘనతని, గౌరవాన్ని కోరుకునేవారు జీవితంలో గోధుమగింజవలె చావడానికి ఏ మాత్రం సిద్ధంగా ఉండరు.

ఈరోజున దేవుడు స్వయం (నేను) అనేది చచ్చిపోయి, ఘనతలు, గౌరవాలు కోరుకొన కుండా బ్రతికేవారు ఎక్కడ ఉన్నారా? అని ఎదురు చూస్తున్నాడు. ఈ రోజున ఇది సమాజములో చాలా కఠినమైన విషయం. గోధుమగింజ వలె ఏ మాత్రం గుర్తింపు లేని, చచ్చిన జీవితం కోసం ఎంతమంది సిద్ధంగా ఉంటారు? నేడు సంఘాలలో గొడవలు, రక రకాల వర్గాలు, గ్రూపులు ఏర్పడడానికి కారణం మా మాటే నెగ్గాలని మా నిర్ణయాలే అమలుపరచాలని. ప్రధానంగా ఇవన్నీ గుర్తింపు కొరకే జరుగుతూ ఉంటాయి. ఇదే ఈ రోజున క్రైస్తవ సమాజమునకు ఒక పెనుసవాలుగా మారిపోయింది, నిజముగా సువార్త ప్రపంచమంతటా విస్తరించడానికి ఇది ఒక పెద్ద ఆటంకంగా మారింది. ఇది చదువుతున్న మనలో ఎంతమందిమి – దేవునిలో కష్టపడి, ప్రయాసపడేవారిగా ఉన్నా, ఎటువంటి గుర్తింపు అక్కరలేదు అనే మనస్సుని కలిగి ఉన్నాము?

**"మరియు ఆయన అందరితో ఇట్లనెను -ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను. తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును, నా నిమిత్తమై తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును." లూకా 9:23,24**

ఎవడైనను నన్ను వెంబడించగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకోవాలి అని యేసు ప్రభువు చెప్తున్నారు. తన్ను తాను ఉపేక్షించుకునే వ్యక్తి ద్వారా దేవుడు తన ఆత్మ సంబంధ మైన పనిని జరిగించి, ఫలభరితంగా చేస్తాడు. జీవితంలో మనస్ఫూర్తిగా ఆలాగున ఆశించి ముందుకు వెళ్ళేవారిగా ఉండాలి. ఎవరైనా మనలను, మన కుటుంబములను తక్కువ చేసి మాట్లాడినా, పట్టించుకోకపోయినా, అప్పటివరకు మనలను దేవుడు అన్నవాళ్ళే దెయ్యమ న్నట్లు మాట్లాడినా బాధపడకుండా, తిరుగుబాటు చేయకుండా ఉండాలి. అదే గోధుమగింజ స్థితికి, గోధుమగింజ చచ్చిన స్థితికి ఉన్న వ్యత్యాసం. గోధుమగింజ మొదట చేసే పని ఏమి టంటే తాను ఉన్న స్థలము నుండి ఏదైతే అట్టడుగు ప్రదేశమో దానిలోపడి, తరువాత అది చనిపోవడానికి సిద్ధమవుతుంది. ఆ అట్టడుగు ప్రదేశమే భూమి. అక్కడ భూమిలో నీరు, మట్టి ఎప్పుడైతే దానిని తాకుతాయో వెంటనే ఆ గింజలో మార్పులు మొదలవుతాయి. అది తన కఠినత్వమును, రూపమును పోగొట్టుకుంటుంది. మనము కూడా మట్టివారము అని ఎరిగితే ఎంతవరకు తగ్గడానికైనా వెనుకాడము. అలాగున మనము కూడ గోధుమగింజవలె మన రూపమును, కఠినత్వమును పోగొట్టుకొనవలసినవారమై ఉన్నాము. మనందరి రూపము ఆదాము రూపము అంటే శరీర సంబంధమైనది కాదు కాని మన హృదయము. అందుకే

యెషయా ప్రవక్త ద్వారా చెప్పబడినట్లు హృదయము మోసకరమైనది, ఘోరమైన వ్యాధి కలిగినది కారణమేమిటంటే మన అందరి స్వభావం అదే. మన హృదయం ఎలా ఆలోచి స్తుంది, స్పందిస్తుంది, ఊహిస్తుంది అని ఎవ్వరూ కూడ గమనించలేరు. మన కన్నా ఆర్థికం గా, ఆత్మీయంగా, మెరుగైనస్థితిలో ఉన్నవారిని చూచి సంతోషించి, దేవునిని స్తుతించేటట్లుగా మన హృదయం స్పందిస్తుందా? లేక అసూయతో స్పందిస్తుందా? ప్రభువా వారిని ఆ స్థితిలో, నన్ను ఈ స్థితిలో ఉంచావు ప్రతివారిని నీ ఉద్ధేశ్యం, ప్రణాళిక చొప్పున నడిపిస్తావయ్యా నీకు స్తోత్రము అని చెప్పగలవా?

గోధుమగింజ తన యొక్క గుర్తింపుని పోగొట్టుకుంటుంది. భూమిలోపడి చావడం అంటే రూపం పోతుంది, మొలక ప్రారంభం అవుతుంది. ఆ మొలక ప్రారంభమయ్యేసరికి కొంత మార్పు వస్తుంది. అది మొక్కగా మారిన తరువాత మనం గోధుమగింజ కోసం త్రవ్వి చూస్తే, అక్కడ ఏమీ ఉండదు. గింజ ఒక్కటే కానీ అనేకమైన గింజలు దాని ద్వారా బహుగా ఫలి స్తాయి. ఒక వ్యక్తి తన స్వయాన్ని, నేను అనే స్వభావాన్ని చంపుకొని గోధుమగింజవలె చనిపో వటానికి ఇష్టపడితే అనేక మందికి మేలు జరుగుతుంది.

వ్యవసాయదారులు విత్తనం కేజీలలో వేస్తే పంట టన్నులలో వస్తుంది. మనం ఒక గింజను భూమిలో నాటితే ముప్పదంతలుగా, అరవదంతలుగా, నూరంతలుగా పంట చేతికి వస్తుంది. అలాగే నువ్వు, నేను కూడా యేసుక్రీస్తు వలె త్యాగానికి సిద్ధమైతే అప్పుడు ఫలిస్తాము. క్రీస్తు సిలువలో తన ప్రాణాన్ని పెట్టి సమాధి చేయబడి, తిరిగి లేచాడు. కోటానుకోట్ల మంది మార్చబడ్డారంటే ఆయన చనిపోయి తిరిగి లేపబడటమే కారణం. ఆయన మాత్రమే కాదు ఆ తరువాత ఆయన అడుగుజాడలలో నడుస్తూ మొట్టమొదట స్తెఫను అనే వ్యక్తి సువార్త ప్రకటిస్తూ మరణించాడు. దానివలన గొప్ప భక్తుడైన పౌలు రక్షించ బడ్డాడు, పౌలుతోపాటు ఇంకా అనేకమంది రక్షింపబడ్డారు. కేవలం యేసుక్రీస్తు, స్తెఫను, పౌలే కాదు పేతురు, యాకోబు, తోమా చనిపోయారు. వారందరూ చనిపోవటం అంటే ప్రతి దినము జీవించుచు గోధుమగింజవలె చనిపోయారు. అలాగే మరణములో కూడా హతసాక్షు లుగా మార్చబడ్డారు. అంటే తమ ప్రాణము తమకి ఎంతమాత్రమూ ప్రియమైనది కాదు, నీకు, నాకు కూడా ఉండవలసిన లక్షణం అదే.

అనేకమందికి నువ్వు చాలా గొప్పవాడివి ఇది చెయ్యి, అది చెయ్యి అంటే సంతోషమే గానీ, నువ్వు పూర్తిగా నీ గుర్తింపుని కోల్పోవాలి అంటే ఎవరికి ఇష్టం. గోధుమగింజ ఫలించి బాగా వచ్చిన తర్వాత ఆ ఫలాలన్నింటికీ కారణం ఏంటి? ఆ గింజనే కానీ అది కనబడదు. అలాగే మనమే సమస్త ఆశీర్వాదాలకీ కారణం కావొచ్చు కానీ మనం కనబడకుండా ఉండాలి. మనలను బట్టి వందమంది ఆశీర్వాదం పొందితే మనం లేకపోయినా పర్వాలేదు అనే

స్వభావం మనకి కావాలి. లోకంలో అయితే నేను కనబడాలి, నన్ను పొగడాలి అనే స్వభావం కనబడుతుంది కానీ క్రైస్తవ సమాజంలో మాత్రమే నేను అనేది కనబడకపోయినా నన్నుబట్టీ దీవించబడితే, ఆశీర్వదించబడితే, ఫలించబడితే, దేవుని యొద్దకు అనేక ఆత్మలు వస్తే చాలు, నేను ఎలా ఉన్నా పర్లేదని అనుకుంటారు. మరుగైపోయే జీవితాల ద్వారా కలిగే ఫలాలు మరిదేని ద్వారా కలుగవు. ఈ లెక్కలన్నీ పరలోకరాజ్యం వెళ్ళాక దేవుని దగ్గర తెలుస్తాయి. అప్పుడు ఘనతలు కోరుకునేవారు, అందరికీ కనబడాలని, కనిపించాలని అనుకునేవారం దరూ ఒక చివర ఒక మూలన ఉంటారు. గోధుమగింజవలె భూమిలో పడి చనిపోయేవారు చేసే క్రియలు ఎవరికీ చెప్పరు. కొంతమంది వారి ధనాన్ని ఎంతో దేవుని కొరకు ఖర్చు పెడతారు కానీ వారి నోటి నుండి ఎంతమాత్రం ఎవరితోనూ అనరు. యథార్థంగా ప్రవ ర్తించేవారు ఎవరికీ తెలియకుండా ఉంటారు. సంఘముకొరకు, మనందరికొరకు ప్రార్థించే వారిగా ఉంటారు కానీ ఎవరికీ తెలియదు దేవునికి మాత్రమే తెలుసు. ఇలాగున ఆ గోధుమ గింజ వంటి మనస్తత్వం కలిగిన వారందరినిబట్టి దేవునిని స్తుతిస్తున్నాను. నువ్వు అలా ఉంటే ధన్యుడివి, ధన్యురాలివి. నువ్వు నువ్వుగా భూమిలో పడి చనిపోవడానికి ఇష్టపడితే, నువ్వు అనేక మందికి ఆశీర్వాదకరంగా ఉండేటట్లు దేవుడు చేస్తాడు. నిన్ను బట్టి అనేక మందిని ఫలభరితంగా చేస్తాడు. పరలోకం వెళ్ళాక ఎవరిని బట్టి వీళ్ళందరూ ఫలభరితంగా ఉన్నారు అని దేవుడు లెక్కలు చూస్తే నీ పేరు ఉంటుంది. అప్పుడు నువ్వు **"ఎవరికి కనబడకుండా వారి కోసం దేవునికి చేసిన ప్రార్థన"** అని విని ఆశ్చర్యపోతావు, అప్పుడు మరుగైన వారందరూ బయటపడతారు. ఇది చదువుతున్న ప్రతి ఒక్కరికి ఆ గోధుమ గింజవలె చనిపోయి ఫలించే స్థితిని దేవుడు కలుగజేయును గాక.

**అట్టి కృప దేవుడు మనకు అనుగ్రహించును గాక!**


YouTube లైవ్

**ఆదివారం ఆరాధన**
**ఉ.9.30 గం.ల నుండి**
**వీక్షించగలరు.**

**YouTube Channel Name: DEVUNI SPARSHA**

# హతసాక్షులు

## వెరోనికా లోహన్స్

(గడచిన సంచిక తరువాయి భాగం)

ఇంతటి తొందరలు జరుగుతున్నను, క్రీస్తును గురించి తెలుసుకోవాలని వచ్చేవారి సంఖ్య పెరుగుతూ ఉండినది. ఈ విధముగా వచ్చిన వారిలో ఆఫ్రికాకు చెందిన మరియు అక్కడ పుట్టిన బానిసలే గాక, వేర్వేరు తెగల వారు మరియు ఆచారములు గలవారు కూడుకొనెడి వారు. థామస్ ద్వీపములో జరిగిన మొట్టమొదటి బాప్తీస్మముల ద్వారా మందింగ, మోంగ్రీ, ఫాంటి, అట్జా, కాసేంటీ, టిజరబా, అమీనా, వాట్జీ మరియు లాంగో తెగల వారు సంఘములో ప్రవేశించారు.

1738వ సంవత్సరంలో ఇదివరకు బానిసగా ఉన్న వ్యక్తి సలహా ద్వారా మొరావియన్ వారు కొంతమంది బాప్తీస్మము పొందిన బానిసలను మరియు ఆ ద్వీపములో కొంత పత్తి పండించే భూమిని కొనగలిగారు. ఆ భూమిని కొనుట ద్వారా నల్లజాతి విశ్వాసులలో కలిగించిన సంతోషముతో వారు స్తుతికూటము చేశారు. అది తెల్లవారి సూర్యుడు ఉదయించే దాకా జరిగింది. ఎటువంటి తొందరలేకుండ కూడుకొనుటకు వారికి ఒక స్థలము దొరికింది. ప్రతి కూటమునకు కూడ వందలమంది వచ్చేవారు. అనారోగ్యముగా ఉన్నవారు, భుజములపై మోసికొని తేబడేవారు, ఒక్క కాలు కలిగిన వారు కఱ్ఱ సహాయముతో కుంటుకుంటూ వచ్చేవారు. రెండుకాళ్లు పోగొట్టుకొనిన వారు (రిక్షా)లో ప్రాకుకొంటూ వచ్చేవారు. వాళ్లు ఆ కూటముల ప్రారంభమును తెలుపుటకు బూరలు ఊదేవారు గనుక వారి కూటమును పోసనన్‌బర్గ్‌లో (బూరలపర్వతం) అని పిలిచేవారు. అయితే ఆనందము మరియు ప్రశాంతత ఎక్కువ కాలము నిలువలేదు.

ఇద్దరు మొరావియన్ సహోదరులు ఫ్రెడ్రిక్ మార్టిన్, మాత్యూస్ ఫ్రెయిండ్ వీక్ 1737వ సంవత్సరమున కరువుతో మాడిపోతున్న అనాధులైన పిల్లలను చేరదీయుటకు నిర్ణయించుకొన్నారు. ఈ పిల్లల విషయము శ్రద్ధ తీసుకొనుటకుగాను రెబెక్కా అను ఒక స్త్రీని ఏర్పరచుకొన్నారు. ఈమె తన 12వ సంవత్సరము వయసులో బానిసత్వము నుండి విడుదల పొంది, మొరావియన్ సంఘములో చేరిన వ్యక్తి. తదనంతరము ఆమె, మాత్యూస్‌ను వివాహము చేసుకొన్నారు. ఫ్రెడ్రిక్ ఒక అభిషిక్త సంఘ కాపరిగా వారి వివాహము జరిగించాడు. వారు వారి జీవితమును తొమ్మిది మంది పిల్లలను దత్తత తీసుకొని మొదలుపెట్టారు. మొరావియన్ మిషన్‌లో రెబెక్కా ఒక సువార్తికురాలిగా ఉండి స్త్రీలకు కాపరి శ్రద్ధను ఇచ్చుచున్నది. వారి సంఘ కాపరియైన జాన్‌బోరమ్ సహకారముతో మొరావియన్ సంఘము యొక్క ప్రభావము

ను తీసివేయుటకు అక్కడ తోటల యజమానులు నిర్ణయించుకున్నారు. వారు తీసుకొనిన కారణము మాత్యూస్ మరియు రెబెక్కాల మధ్య జరిగిన వివాహము. ఒక తెల్లజాతీయుడు ఒక నల్లజాతి స్త్రీని వివాహము చేసికొనుట ఎప్పటి నుండి న్యాయచట్టమైనదని కోపముతో ప్రశ్నించారు. (ఆ విధముగా ప్రశ్నించిన వారు, అక్రమ సంబంధము వలన కలిగిన పిల్లలను కలిగి యున్నవారు). అంతేకాకుండా వారికి వివాహేము జరిగించుటకు ఫ్రెడ్రిక్ మార్టిన్‌కు ఎవరు అధికారము ఇచ్చారు? అని ప్రశ్నించారు.

సెయింట్ థామస్‌లోని న్యాయవాది కోర్టులో మాత్యూస్ మరియు రెబెక్కా ఒక ప్రమాణమును చెప్పుటకు నిరాకరించుటనుబట్టి, జైలులో వేయబడ్డారు. అక్కడ పగలు సమయములో పొయ్యిలాగా వేడిగా ఉండేది, రాత్రి పడుకొనుటకు ఏమి లేకుండాపోయింది. వీరు చెప్పు ధైర్యమును కలిగించు మాటలను వినుటకు చాలామంది బానిసలు వారి ప్రాణ మును తెగించి వారు ఉన్న కిటికీ దగ్గరకు వచ్చేవారు. వారి శాంతియుతమైన విధానము విశ్వాసులకు ప్రోత్సాహము కలిగించింది. ఇప్పుడు 51తోటలనుండి ఇద్దరు నల్లజాతీయు లైన క్రిస్టోఫ్ మరియు మింగోల నాయకత్వములో 750మంది విశ్వాసులయ్యారు. ఇద్దరు జర్మన్ సోదరులు జైలులో ఉండుట ద్వారా జాన్‌బోరమ్ మరియు ఇతర ప్రొటస్టంట్ సోదరులు నల్లజాతీయుల సంఘమును తుడిచిపెట్టుటకు పూనుకొన్నారు. నల్లజాతి విశ్వాసు లను ఒక్కొక్కరినిగా న్యాయస్థానము ముందు పాస్టరు నిలువబెట్టారు. ముఖ్యముగా వారికిష్ట మైన వేదాంతపరమైన ప్రశ్నలను వేసి, వారు ఏ విధముగా స్పందిస్తారో చూచుటకు ప్రయ త్నించాడు. అంతేకాకుండా ఏ విశ్వాసము బైబిల్ పరమైనది, లూథరన్ లేక రిఫార్మడ్ సంఘమునకు చెందినదా? కొంతకాలము తరువాత నల్లజాతీయులు తెల్లజాతీయులను పరిపాలిస్తారా అని ప్రశ్నించేవాడు.

'మాకు మతమును గురించి ఏమి తెలియదు' అని నల్లజాతి క్రైస్తవులు చెప్పారు. మాకు తెలిసినంత వరకు దేవుని గొఱ్ఱెపిల్ల చనిపోయి, మా పాపములు క్షమింపబడినవని మాత్రమే మాకు తెలుసు అని చెప్పారు. తెల్లవారిని నల్లజాతీయులు పరిపాలిస్తారని మాకు తెలియదు. కానీ మరణమైనప్పుడు అందరూ క్రీస్తు ముందు నిలువబడతారు. అక్కడ అందరూ సమాన మేనని చెప్పారు. "చూడండి వాళ్లకు ఏమి తెలియదు' అని పాస్టరు బోరమ్ సంతోషించాడు. ఆ హెరెన్‌హట్ ప్రవక్తలు ఏమీ తెలియని వారికి బాప్తీస్మము ఇస్తున్నారని చెప్పాడు. మాత్యూస్, రెబెక్కా బహిరంగంగా అలజడి రేపుతున్నారని న్యాయస్థానము వారికి శిక్ష విధిం చింది. అవినీతికరమైన పద్ధతిలో నివసిస్తున్నారని మాత్యూస్‌కు కొంత జరిమానా న్యాయ స్థానం విధించింది. రిఫార్మడ్ సంఘములో రెబెక్కా ఆరాధించి ఉండుటనుబట్టి ఆమెను సంఘము నుండి వెలివేసి, ఆమె బానిసగా అమ్మబడుటకు పంపబడింది. ఫ్రెడ్రిక్ మార్టిన్

శిక్షింపబడుటకు మరియు దేశము నుండి వెలివేయబడుటకు వేచియుండుట జరిగింది. కానీ కొంత అనారోగ్యకారణము వలన విడిచిపెట్టబడ్డాడు.

కొన్ని వారముల తరువాత ఒక ఓడ సెయింట్ థామస్ రేవుకు వచ్చింది. అందులో వచ్చిన వారు జర్మనులు మరియు ముఖ్యమైన వ్యక్తులుగా గుర్తించారు. గవర్నరు తన అసమ్మతిని కనబరచకుండా కౌంటునికోలస్ లుడ్విగ్‌వాన్ జిన్‌జెన్ డార్ఫ్‌కు స్వాగతం పలికాడు. ఆ ద్వీపము యొక్క అధికారులకు తెలుసు ఆయన హెరెన్‌హాట్ నుంచి వచ్చాడని, అతను వారం దరికన్నా అధికారియైయున్నాడని. ఆయన మాత్యూస్ మరియు రెబెక్కాల విడుదల కొరకు కోరినప్పుడు వెంటనే అంగీకరించారు. ఆ షిప్‌లో వచ్చిన వారిలో వెరోనికా లోహన్స్, ఆమె భర్త వెలంటీన్ మరియు మరియొక మొరావియన్ దంపతులు ఉన్నారు. కొన్ని నెలల తరువాత ఈ వృత్తాంతము యొక్క ప్రారంభములో చెప్పబడిన బాధలను వెరోనికా తిరిగి అనుభవించుట జరిగింది.

1768వసంవత్సరమునకల్లా 79మంది మిషనెరీలు హెరెన్‌హాట్ నుండి పంపబడి, వెస్ట్ ఇండియాలో కష్టముల మూలముగా మరియు వేడి ప్రదేశములో వచ్చు జబ్బుల వలన వారి ప్రాణములను పోగొట్టుకొన్నారు. చనిపోయిన ప్రతి ఒక్కరి స్థానములో అరవైమంది విశ్వాసులు నిలువగలిగారు. ఏభై సంవత్సర కాలములో తొమ్మిది వేలమంది ఆఫ్రికనులు, సంఘ సభ్యులుగా అయ్యారు.

సేకరించబడింది

ఇంకా ఉంది



# ధైర్యము

సిస్టర్. విజయ

**"ధైర్యముగా ఉండుము"** అనే మాటని మనము తరచుగా పరిశుద్ధగ్రంథంలో గమనిస్తాము. ధైర్యం అనేది మనందరికి అవసరమైనది. మన జీవితంలో పరీక్షలు మరియు శ్రమలు కలిగినప్పుడు దుష్టుడు మనలను భయపెట్టాలని చూస్తాడు కానీ వాటిని జయించడానికి కావలసిన విశ్వాసమును మరియు ధైర్యమును దేవుడు మనకి అనుగ్రహిస్తారు. స్త్రీలమైన మనము చిన్న చిన్న విషయములకు భయపడుతూ, కుటుంబములలో అసమాధానమును కలుగజేస్తూ ఉంటాము. కానీ దేవుని లేఖనములు మాత్రము "భయపడవద్దు" అని చెప్పుచున్నాయి. భయము అపవాది ప్రేరేపణ వలన కలిగేది, ధైర్యం దేవునియొద్ద నుండి వస్తుంది. **"లోకములో మీకు శ్రమ కలుగును, అయినను ధైర్యము తెచ్చుకొనుడి"** అని **యోహాను 16:33**లో చెప్పబడినట్లుగా పరిస్థితులు ఏవైననూ, భయపడక ధైర్యము తెచ్చుకోవాలి. భయం మన జీవితంలో దేవునియందు అవిశ్వాసమును కలుగజేస్తుంది. ఒక స్త్రీగా దేవునికొరకు గొప్ప కార్యములు చేయాలంటే, కుటుంబములలో ఆశీర్వాదమును పొందాలంటే భయం స్థానంలో దేవునియందు బలమైన విశ్వాసము కలిగి, ధైర్యము తెచ్చుకొని జీవించాలి.

ఒక కొండ ప్రాంతములో నివసిస్తున్న గ్రామస్థులందరూ క్రైస్తవులు. వారు పోలిస్‌స్టేషన్‌కి వచ్చి క్రైస్తవ్యమును వదులుకుంటున్నట్లు ప్రమాణం చేయాలని ఒక అధికారి హెచ్చరించాడు. ఒకవేళ వారు అలా చేయకపోతే వారి చేతులు కాళ్ళు కట్టివేసి, రాళ్ళతో కొట్టి ఎత్తైన వంతెన నుండి నదిలోనికి త్రోసివేస్తానని వారిని హెచ్చరించాడు. ఈ విషయం విన్న క్రైస్తవులు మధ్య రాత్రి కూడుకొని "మనం క్రైస్తవులుగా ఇక ఉండలేము, లేకపోతే అతడు మనలను నిశ్చయంగా చంపివేస్తాడు" అని చర్చించుకోవడం మొదలు పెట్టారు.

**"మీ దేహములను చంపువానికి భయపడవద్దు కాని మీ దేహమును మరియు ఆత్మను చంపు వానికే భయపడమని"** యేసు సువార్తలలో చెప్పారు కదా! ఒకవేళ అతడు మనలను చంపినా కేవలం మన దేహములను మాత్రమే మన ఆత్మలు సదాకాలం యేసుతో కూడా జీవిస్తాయి అని ఒక యౌవనస్థుడు లేచి అందరిని ప్రోత్సాహపరిచాడు.

"అవును అది నిజమే" అని అందరూ చేతులెత్తి మేము చావడానికే సిద్ధమని జవాబిచ్చారు. మరునాడు ఆ పోలిస్ అధికారి వచ్చి "మీరు రేపు మరణిస్తారు" అని క్రూరంగా నవ్వుతూ అన్నాడు. తరువాత ఆ పోలీస్ అధికారి చేపలు పట్టుటకు నీళ్ళలో నడుస్తుండగా ఒక చెట్టుకు అతని కాలు తగిలి కాలు జారి నదిలో మునిగిపోయాడు. ఆ సమయం క్రైస్తవులందరూ కలిసి ఏకమనస్సుతో దేవునికి ప్రార్థిస్తున్న సమయం. అప్పుడు ఒకడు పరిగెత్తుకుంటూ వచ్చి

**“మిమ్మలను రేపు చంపాలని ఉద్దేశించిన ఆ వ్యక్తి నదిలో మునిగిపోయాడు”** అని చెప్పాడు.

చూశారా! ఇది అనుకోకుండా జరిగిన సంభవం కానే కాదు. క్రైస్తవులైన ఆ గ్రామస్థులు తమకి కలిగిన శ్రమలో భయమును విడిచి, ధైర్యమును ఎంచుకొనినప్పుడు దేవునియందు వారు కలిగియున్న విశ్వాసం దేవుడు కార్యము చేయునట్లుగా ద్వారములను తెరిచింది.. ఏ నదిలోనైతే వారిని ముంచాలని ఆ పోలీస్ అధికారి ప్రయత్నించాడో, అదే నదిలో ఆ శత్రువు మునిగిపోవునట్లుగా దేవుడు కార్యం చేశారు. మనము విశ్వాసముతో, ధైర్యముతో దేవుని వాగ్ధానమును విశ్వసించి ముందుకు సాగుతున్నప్పుడు మన మీద సాతాను చేసిన పన్నాగాలు అన్నీ వ్యర్థమైపోతాయి.

పరిశుద్ధగ్రంథంలో ధైర్యంతో సమస్యలను ఎదుర్కొన్న స్త్రీలను మనము ధ్యానించినట్లైతే, ఎస్తేరు అనే స్త్రీ దుష్టుడైన హామాను చేతినుండి దేవుని ప్రజలైన యూదులను ధైర్యంతో కాపాడుకోగలిగింది. ఎస్తేరు అందమైన రూపము కలిగినది, అయిననూ ఆమె తన అంద మును ఉపయోగించుకోలేదు కానీ తనకి ఉన్న అచంచలమైన విశ్వాసం మరియు మంచి ప్రవర్తన ద్వారా రాజైన అహష్వేరోషు యొక్క దయను సంపాదించుకుంది. దేవుని ప్రజలైన యూదులను నాశనం చేయవలెనని రాజ శాసనం చేయబడి, పరిస్థితులు తీవ్రంగా ఉన్ననూ, ఆహ్వానించబడకుండానే రాజు యొక్క ఆస్థానంలోకి విశ్వాసంతో సాహసం చేసి వెళ్ళింది. ఆ సమయంలో ఆమె కోసం ప్రత్యేకంగా విశ్వాసంతో ప్రార్థిస్తున్న యూదుల ప్రార్థనలను దేవుడు ఆలకించి వారి విశ్వాసమును, ఆమె విశ్వాసమును దేవుడు ఘనపరిచాడు. అప్పుడు రాజు ఆమెను సంతోషంతో తన ఆస్థానంలోకి చేర్చుకున్నాడు. చివరికి ఆమె దేవుని సహా యంతో తన ప్రజలు నాశనం కాకుండా కాపాడింది.

అదే విధంగా ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించడానికి నాయకుడిగా దేవునిచే ఎన్నిక చేయబడిన మోషే యొక్క తల్లియైన యోకెబెదు యొక్క ధైర్యమును గురించి ఆలోచించినప్పుడు మనము ఎంతగానో భయమును పోగొట్టు కోవచ్చు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో బానిసలుగా వెట్టి చాకిరి చేస్తూ ఉన్న దినమలలో వీరి మగశిశువులను చంపమని ఐగుప్తు రాజైన ఫరో ఆజ్ఞ ఇచ్చాడు. కాని ఆమె రాజాజ్ఞని కూడా



ధిక్కరించి తన కుమారుని 3నెలలు ఎవరికి తెలియకుండా దాచి ఉంచింది. ఆ తరువాత దేవుడు తన కుమారుని కాపాడతాడనే విశ్వాసముతో ఆమె వానిని జమ్ము పెట్టెలో పెట్టి నదిలో వదిలింది. చివరికి మోషే ఫరో కుమార్తె వద్దకు జాగ్రత్తగా ఆ జమ్ము పెట్టె ద్వారానే చేరేంతవరకు అక్కడే కనిపెట్టుకొని ఉన్న మోషే అక్కయైన మిర్యాము భయపడి,

పారిపోయి మరియు దాగుకోవడానికి బదులు ధైర్యంగా ఆమె యొద్దకు వెళ్ళింది. ఆ పిల్లవానికి పాలు ఇవ్వడానికి ఒక దాదిని తీసుకు వస్తానని ఆమె ఫరో కుమార్తెతో ధైర్యంగా చెప్పింది, ఆ దాదియే మోషే తల్లి.

ఎంత క్లిష్టమైన పరిస్థితులు ఉన్ననూ ధైర్యంతో వాటిని అధిగమించుట అనేది అవసరం. ఈ ధైర్యం ఆపదలో ఉన్న యూదుల ప్రాణాలను కాపాడగలిగింది. ఇశ్రాయేలు ప్రజలను నడిపించగలిగిన గొప్ప నాయకుడిని అనుగ్రహించింది. సమస్య నుండి పారిపోక, జీవితంలో అసాధారణ ధైర్యంతో జీవించుట నేర్చుకోవడం ప్రారంభిస్తే అసాధారణ కార్యములను ఆయన మన జీవితంలో, కుటుంబములలో జరిగిస్తారు.

కాబట్టి ప్రియ సహోదరీ! కుటుంబములోని వారి మార్పు, ఆర్థిక, ఆత్మీయ, ఆరోగ్యపరంగా సమస్య, శోధన ఎదురవుచున్నప్పుడు భయంతో కృంగిపోయి, నిరాశపడిపోక, ప్రతి పరిస్థితిలో మార్పుని కలుగజేయగలిగిన దేవునియందు విశ్వాసముంచి "నేను వాటిని జయించగలను" అని ధైర్యము తెచ్చుకొనుట ద్వారా దేవునికొరకు గొప్ప కార్యములు చేసే స్త్రీలుగా మనలను సిద్ధపరుస్తారు.

***అట్టి ధైర్యమును దేవుడు మనకు అనుగ్రహించును గాక!***


## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com



# జాన్ వెస్లీ

-సీరియల్ 26వ భాగము

చిన్న ప్రదేశములలో కూడ వెస్లీ పలికిన మాటల మీద దేవునిముద్ర ఉన్నట్లు కనిపించెడిది. వాక్యము హృదయములలోనికి వాడియైన ఖడ్గమువలె దూసుకొనిపోవుచుండెను. క్రీస్తు సువార్తను తన ఇష్టమైనరీతిలో మలచుచున్న ఒక వ్యక్తి వెస్లీతో వాదించుచుండెను. వెస్లీ ఆ వ్యక్తితో మాట్లాడుచుండగా అతని ప్రక్కన ఉన్న ఒక స్త్రీ తన పాపములకు బహుగా ప్రలాపించుచుండెను. ఆమెను ప్రక్క ఇంటిలోనికి మోసికొని వెళ్లవలసివచ్చెను. మార్గములో కూడ ఆమె రోదనను ఆపలేకపోయిరి. వెస్లీ, తన తోటివారు ఆమెకై ప్రార్థించగా దేవుడామెను ఆ వేదన నుండి విడిపించెను. సువార్తను తారుమారు చేయుచున్న ఆ వ్యక్తి యొక్క నోరు మూయబడెను.

వెస్లీ లండన్‌లో ఉన్నప్పుడెల్ల తన ప్రార్థనాగుంపు (Fetter lane Society) వారి మధ్య పరిచర్య చేయుచుండెడివాడు. అదే సమయమున వెస్లీని త్వరగా బ్రిస్టల్‌కు రమ్మని విట్‌ఫీల్డ్ ఉత్తరము వ్రాసెను. అయితే వెస్లీ లండన్‌లో విస్తరించుచున్న సేవను విడిచి బ్రిస్టల్ వెళ్ళుటకు మనస్కరించలేదు, ఛార్లెస్ కూడ ఇందుకు అంగీకరించలేదు. ఈ విషయమై దేవుని చిత్తము అడుగగా బ్రిస్టల్‌కు వెళ్లమని ప్రభువు చెప్పెను. విట్‌ఫీల్డ్ జార్జియా వెళ్లవలసి ఉండెను. బ్రిస్టల్‌లో ఆయన ప్రసంగములు జనసమూహములను కదిలించెను. ప్రజలు విట్‌ఫీల్డ్ నోట నుండి వెలువడు దైవవాక్కులకై ఆయన చుట్టు గుమికూడేవారు. ఇప్పుడు జార్జియా వెళ్లవలెనని ఆ ప్రజలను ఎవరికి అప్పగించగలడు? వెస్లీకే గదా? జార్జియాకు వెళ్లకుముందు విట్ ఫీల్డ్ చేసిన వీడ్కోలు ప్రసంగము విని ప్రజలు ఏడ్చిరి. ఆయనను చుట్టుముట్టి వదలలేక కౌగలించుకొనుచుండిరి, ఆలయము పట్టలేదు. స్థలము దొరికిన చోటెల్ల ప్రజలు క్రిక్కిరిసి కూర్చుండిరి.

విట్‌ఫీల్డ్‌కు 21సం॥ల ప్రాయము, అప్పుడే కళాశాల నుండి పట్టబద్ధుడయ్యెను. ఆ వెంటనే తన జీవితమును పూర్తిగా దేవునికి సమర్పించుకొనుట వలన సంఘనాయకులు ఆయనను అభిషేకించు సమయమున అతడు శక్తివంతమైన దైవాభిషేకము పొందెను. దేవుడు విట్‌ఫీల్డ్‌కి ఇచ్చిన వాగ్ధాటి మనుష్యులను పూర్తిగా దేవునివైపునకు మరలించు ప్రభావముగలదై ఉండెను, అది చూచి పాదుర్లు అసూయపడిరి. 1738వ సం॥ము డిసెంబర్ మాసములో జార్జియానుండి ఇంగ్లాండుకు తిరిగి వచ్చినప్పుడు ఆయనకు అనేక ఆలయములు మూయబడెను. ఒకవేళ వారాయనను ఆహ్వానించినట్లైతే ఆ ఆలయములు పట్టెడివి కావు.

వాక్యమనెడి దివ్య మన్నా కొరకు ప్రజలు ఆకలితో అలమటించుచుండిరి. ఇట్లు సొమ్మసిల్లిన సమూహముల దాహము తీర్చుటెట్లు? అందువలన విట్‌ఫీల్డ్ ఒక తీర్మానమునకు వచ్చెను. ఎన్నడును, ఎవరును చేయనట్టి నూతన విధానమును అవలంబించవలసివచ్చెను. కేవలము తనకు ఆలయములు మూసివేయబడిన కారణము చేత తన యజమానుడైన క్రీస్తు బోధించ మనిన ఆజ్ఞను ఉల్లంఘించి అక్కరలోనున్న సమూహమునకు ఏలాగు తన వెన్ను త్రిప్ప గలడు? గనుక అతడు ఇక నుండి బహిరంగ స్థలములలో బోధింప నిశ్చయించెను.

1739వ సం॥ము ఫిబ్రవరి 17వ తేది శనివారమున బ్రిస్టల్‌నకు 4 మైళ్ల దూరమున ఉన్న మైదానములో బొగ్గుగనులలో పనిచేయుచున్న కూలీలకు బహిరంగముగా బోధించెను. చాలామట్టుకు వారు ఏ సంఘమునకు చెందనివారు. సువార్తను ఎన్నడును వినని సాధారణ ప్రజలు. వీరికి బోధించుట విట్‌ఫీల్డ్‌కు ఇష్టమాయెను. ఆయన ప్రసంగమును వినుటకు అనేకులు వచ్చిరి. ఆయన చేసిన 5వ ప్రసంగమును 20 వేలమంది ప్రజలు ఆశతో వినిరి. విట్‌ఫీల్డ్ సువార్తను ప్రకటించక మునుపు బ్రిస్టల్‌లో అల్లరిమూకలు చేసిన ఘోరకృత్యములను చూచిన వారికి ఆ ప్రదేశములో ఎట్టి క్రమబద్ధమైన చట్టములు లేవనిపించెను. అయితే సువార్త ప్రసంగములు ప్రారంభమైన 6నెలలకు వందలమంది వెస్లీ ప్రార్థనా గుంపులలో సభ్యులైరి, వారికొరకు ఒక పాఠశాల స్థాపించిరి, దాని ఖర్చును వారే భరించిరి.

విట్‌ఫీల్డ్ బహిరంగముగా బోధించుట ప్రారంభించినపుడు సేవకు అనేక నూతన ద్వారములు తెరువబడెను. ఒక సజ్జనుడు బ్రిస్టల్ పట్టణమునకు వెలుపల బోధించుట ఎందులకు? అని బ్రిస్టల్ పట్టణం మధ్యలోనున్న తన పెద్ద మైదానమును సేవకొరకు విని యోగించమని విట్‌ఫీల్డ్‌ను కోరెను. లండన్ నుండి వెస్లీని పిలువగా ఆయన ఇచ్చటికి వచ్చెను. దేవుని ఆలయములలో ప్రసంగించుటకు అలవడిన వెస్లీ బహిరంగ ప్రసంగములను చూచి నిశ్చేష్టుడయ్యెను. ఆయన మనస్సు గుడులకును, అచ్చటి ఆరాధనా విధానమునకును లోతుగా అంటుకట్టబడియుండెను. ఆయనకు కూడ అనేక ఆలయములు మూయబడినప్పటికిని ఈరీతిగా గుడి వెలుపల ప్రసంగించుటయను యోచన తట్టనే లేదు. తాను అలవడిన విధానమునుండి వెస్లీని వేరుచేయుట కష్టతరముగాని ఆయనకు వేరే మార్గము లేకపోయెను.

**సేకరించబడింది**

**ఇంకా ఉంది**

# 'పిల్లలు - పెద్దలు"

ప్రియమైన పిల్లలూ! ఎలా ఉన్నారు? హాలిడేస్ కదా, బాగా ఆటలతో బిజీ నా?? సమ్మర్ హాలిడేస్ అంటే మీకే కాదు పెద్దలకి కూడా ఇష్టమే.... ఎందుకంటే ఈ సమయంలో పిల్లల్ని తీసుకుని విహారయాత్రలకి, బంధువుల ఇళ్లకి వెళ్లి చాలా సంతోషంగా గడపాలని ఆశపడతారు. బంధువులతో, స్నేహితులతో ఆనందంగా గడపటానికి అనువైన సమయం ఈ సమ్మర్.... మీకైతే క్రొత్త క్రొత్త ఆటలు, క్రొత్త పరిచయాలు, ఫ్రెండ్స్ ఇలా అన్నీ స్పెషల్ గానే ఉంటాయి.

చిన్నప్పటి ఆటలు, పాటలు అన్నీ స్వీట్ మెమరీస్ గానే ఉంటాయి ప్రతి ఒక్కరికీ. ఈ జనరేషన్‌లో అయితే మానవ సంబంధాల కంటే ఎలక్ట్రానిక్ వస్తువులతోనే ఎక్కువ సంబంధాలు కనబడుతున్నాయి. అనగా టి.వి., కంప్యూటర్ లేక సెల్ ఫోన్‌లు వీటితోనే పిల్లలు ఎక్కువగా గడుపుతున్నారు మానవ, ఆత్మీయ అనుబంధాలు అదృశ్యమైపోతున్నాయి. అమ్మమ్మ చెప్పే భయభక్తులు, నాయనమ్మ చెప్పే కథలు, తాతలు నేర్పే అలవాట్లు ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో అనుభవాలు అనుభూతులు కలుగుతాయి. ఈరోజుల్లో పిల్లలు పట్టుమని పదిరోజులు ఎవరి ఇంట్లోనైనా ఇమడగలుగుతున్నారా? ఎవరి స్వేచ్ఛ వారిది, ఎవరి మాటా వినరు, ఎవరికీ లోబడరు. చిన్నప్పటి నుండే 'నేను' అనే అహం, నాకు అన్నీ తెలుసు అనే గర్వము, ఎవరి మాటను లెక్క చేయనియ్యదు.

ఒక చిన్న గ్రామంలో సోము అనే పిల్లవాడు ఉండేవాడు. ఎప్పుడూ చిలిపిచేష్టలు చేస్తూ తోటి పిల్లల్ని ఆట పట్టిస్తూ ఉండేవాడు. సోముకి మంచి బుద్ధులు నేర్పటానికి అతడి తల్లి చాలా కష్టపడేది. పెద్దవాళ్ళతో మర్యాదగా ఉండాలని, ఇతరులతో మంచిగా మసలుకోవాలని ఎన్నోసార్లు చెప్పి చూసింది. అమ్మ మాటలు విని‌నట్టే విని మళ్ళీ వెంటనే తన అల్లరి మొదలు పెట్టేవాడు. సోము అల్లరితో విసిగి పోయిన వాళ్ళమ్మ "చూడు బాబూ! నేనెన్ని చెప్పినా నువ్వు వినటం లేదు. ఏదో ఒకరోజు నీ ప్రవర్తన నీకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది గుర్తుంచుకో" అని చెప్పింది.

ఒకరోజు సోము ఊరవతల ఉన్న జామతోటలో జామ కాయల కోసం ఒక చెట్టు ఎక్కాడు. అప్పుడే అక్కడకు ఒక కుర్రాడు వచ్చాడు. పొడవైన ముక్కుతో, తలపై టోపీ, ఉన్ని కోటు ధరించి విచిత్రమైన వేషంతో ఉన్నాడు. అతన్ని ఏడిపించే ఉద్ధేశంతో సోము తన చేతిలో ఉన్న వెదురు గొట్టంతో ఆకాశం వైపు చూడసాగాడు. దాన్ని చూసిన కుర్రాడు "ఆకాశం వైపు ఎందుకు చూస్తున్నావు?" అని అడిగాడు. "ఇదొక మాయ వెదురుగొట్టం. దీనితో చూస్తే ఆకాశంలోని వింతలు కనిపిస్తాయి" అన్నాడు సోము. "నేనూ చూస్తాను ఓసారి నాకు ఇస్తావా!" అని కుర్రాడు అడిగాడు. "ఇస్తాను కానీ దీనికి బదులుగా నీ ఉన్ని కోటు ఇవ్వాలి" అన్నాడు సోము. కుర్రాడు తన ఉన్ని కోటును ఇచ్చి వెదురుగొట్టం తీసుకున్నాడు. అతను ఆ గొట్టంలో నుంచి ఆకాశం వైపు చూస్తే తన మోసం బయటపడుతుందని, అక్కడ ఉండకూడదని ఉన్నికోటు తీసుకొని పరుగెత్తాడు సోము. వేగంగా ఇంటివైపు వెళుతున్న సోమును కొంత దూరం వెళ్ళాక కొందరు పట్టుకున్నారు. "ఇది మా

 మనకు పుస్తకాలు జ్ఞానాన్ని మాత్రమే ఇస్తాయి. ఆ జ్ఞానాన్ని ఎలా వాడాలన్న ఆలోచనను మనకే వదిలేస్తాయి.

అబ్బాయి ఉన్నికోటు" అని సోము ఒంటి మీద ఉన్న ఉన్నికోటును చూసి ఒక వ్యక్తి అరిచాడు.

"ఈ కోటు నీకెలా వచ్చింది? నిన్నటి నుంచి వీళ్ళబ్బాయి కోసం వెతుకుతున్నారు. ఆ అబ్బాయి ఎక్కడ? వాడిని ఏం చేశావు? అంటూ ప్రశ్నలు వేస్తూ సోము చెంప మీద కొట్టాడు ఒక వ్యక్తి. సోమూ ఏడుస్తూ జరిగిన విషయం వారికి వివరించాడు. సోమును ఒక వ్యక్తి గుర్తించి. 'అరె ఈ కుర్రాడు మన సాంబడి కొడుకు సోము. అతడు చెప్పినట్లు నీ కొడుకు జామతోటలో ఉండి ఉంటాడు. వెతుకుదాం రండి అని అతను అనడంతో మిగతా వాళ్ళు సోమును వదిలి ముందుకు వెళ్ళిపోయారు. ఆ సంఘటనతో సోముకి బుద్ధొచ్చింది. ఇక ఆరోజు నుండి అల్లరి పనులు మానేశాడు. ఈరోజుల్లో పిల్లలు కూడా సోమూ వలెనే ఉన్నారు. ఎంత చెప్పినా వినరు ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు మాత్రమే మార్పు కలుగుతుంది. ఇప్పటికి కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులకి, చుట్టుప్రక్కల వారికి పిల్లలంటే భయం కలుగుతుంది. వారు చేసే అల్లరి భరించలేక హాలిడేస్ అంటేనే పెద్దలకి భయంగా వుంటుంది. పిల్లల్ని స్కూలుకి పంపిస్తే కొండంత బరువు దించుకున్న భావన, హాలిడేస్ వచ్చాయి అంటే ఏదో ప్రమాదాలు ముంచుకొస్తున్నాయన్న ఆందోళన కలుగుతుంది.

ఈ హాలిడేస్ లో పెద్దలు చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. ఏం మాట్లాడినా పిల్లల ఉనికిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలి. పిల్లలు మనం మాట్లాడే విధానాన్ని అనుకరిస్తారు. స్నేహితులు, బంధువులు, తోటివారితో పెద్దలు ప్రవర్తించే విధానాన్ని వారు గమనించి నేర్చుకుంటారు. పెద్దలు స్వార్ధంతో, అసూయతో ప్రవర్తించే ప్రవర్తన పసివాళ్ళు చూసి తికమక పడతారు. వాళ్ళకి మంచి, చెడు మాత్రమే తెలుసు.

ఉదాహరణకి నీ పొరుగువారిని చూచి సంతోషంగా మాట్లాడతావు, వారు వెళ్ళిపోయాక వాళ్ళని ఎగతాళి చేస్తూ మాట్లాడటం లాంటివి చేస్తే పిల్లలు తికమక పడి ఆ స్వభావాన్ని వారు కూడా అనుసరిస్తారు. అది వారి భవిష్యత్తుకు ఎంతో ప్రమాదం అని పెద్దలు గ్రహించరు. పైకి మంచిగా, లోపల చెడుగా ఉండే ద్వంద్వ స్వభావాన్ని పెద్దలే పిల్లలకి పరిచయం చేస్తారు. పెద్దలే పెంచి పోషిస్తారు. అమ్మలుగా, నాన్నలుగా, ఆత్మీయులుగా.... ముందు మీరు పిల్లల ఉనికిని గుర్తించి మాట్లాడితే బావుంటుంది.

పిల్లల్ని మంచివాళ్ళుగా తయారుచేయాలని ప్రతి తల్లితండ్రుల ఉద్ధేశ్యం.... కన్నవారి ప్రతిచర్యలో బాధ్యత కనిపిస్తుంది. అనురాగము ఉంటుంది, పిల్లల్లో ఉండే నెగటివ్ అభిప్రాయాల్ని విమర్శించినా, ఎక్కువగా తిట్టినా, కాలక్రమేణా వాళ్ళు "మేము ఎందుకూ పనికి రాము" అనే అభిప్రాయానికి వచ్చేస్తారని మనస్తత్త్వ నిపుణులు చెబుతారు. కాబట్టి వారి ఫీలింగ్స్ ని గమనించి ఏది మంచి ఏది చెడు అనే విషయమును అర్ధమయ్యేలా వివరించండి, ప్రక్కవారితో పోల్చకండి. వీలైనంత వరకూ నిజాయితీ గల పిల్లలుగా ఉండునట్లు ప్రోత్సాహపరచండి. అది వారిని ప్రయోజనకరమైన వారిగా మారుస్తుంది.

ప్రేమతో మీ అక్కయ్య

# నా జీవితములో దేవుని మేలులు

**లక్ష్మీకాంతమ్మ, చింతల్**

దేవుని నామమునకు స్తోత్రములు, మీ అందరికి నా హృదయపూర్వకమైన వందనములు. నా పేరు లక్ష్మీకాంతమ్మ, మాది కృష్ణజిల్లా, మచిలీపట్నం దగ్గర సాతులూరు అనే గ్రామం. మా తల్లిదండ్రులకు ఐదుగురు సంతానం, నేను నాలుగవ దానిని. మా పెద్దమ్మ వాళ్ళకి ఆడపిల్లలు లేకపోవడంతో చిన్నప్పుడే నన్ను పెంచుకొని, చదువు చెప్పించి, వివాహం జరిపించారు. వివాహమైన తర్వాత మాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు. నాకు కొంతకాలం తరువాత విపరీతమైన తలనొప్పి వచ్చేది ప్రతిరోజు టాబ్లెట్ వేసుకుంటేనే పనులు చేసుకోగలను అన్నట్టుగా ఉండేది. అది ఎందుకు వచ్చిందో అర్థమయ్యేది కాదుగాని ఊరిలో తెలిసినవాళ్ళందరు మాత్రం నీకు చేతబడిచేశారు, అందుకే ఈ తలనొప్పి తగ్గడం లేదు అనేవారు. ఎన్నో హాస్పటల్స్‌లో చూపించారు కానీ తగ్గలేదు. అయితే మా ఊరిలో ఒక చిన్న ప్రార్థనా మందిరం ఉండేది. కొంతమంది సలహా ప్రకారం నేను ఆ మందిరానికి వెళ్లేదానిని. నీకు తలనొప్పి తగ్గిపోతుంది అనడంతో వెళ్ళే దానిని గాని దేవుని గురించి అస్సలు ఏమీ తెలియదు.

చిన్నప్పటి నుండి విగ్రహారాధనలో మేము ఉన్నాము కనుక యేసుప్రభువు గురించి నాకు ఏమీ తెలియదు కాని అప్పుడప్పుడు చర్చికి వెళ్తూ ఉండేదాన్ని. అయితే నా భర్త మాత్రం తెలిస్తే అస్సలు వెళ్ళనిచ్చేవాడు కాదు, కోప్పడేవాడు, ఆయనకు తెలియకుండా వెళ్ళేదాన్ని. అలా వెళ్తుండగా వారి ప్రార్థనల ద్వారా నాకు తలనొప్పి తగ్గింది. తరువాత ఒక రోజు ఉదయం లేచి తలనొప్పివస్తే టాబ్లెట్ వేసుకుందామని చూస్తున్నా కాని మళ్ళీ తలనొప్పి నాకు రాలేదు. అప్పటి నుంచి మా ఆయన తిడుతున్నా కూడా చర్చికి వెళ్తూ ఉండేదాన్ని.

కొన్ని సంవత్సరాల తర్వాత ఆర్థికంగా మా పరిస్థితి క్షీణించడంతో బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్ రావడం జరిగింది. అప్పటికే మా ఊరు వ్యక్తి షాపూర్‌లో ఉండేవాడు, ఆయన ద్వారా మేము కూడా వచ్చి షాపూర్‌లో ఏదో ఒక పనిచేసుకుంటూ ఉండేవాళ్ళం. హైదరాబాద్ వచ్చాక ఎక్కడకి వెళ్ళాలో తెలియక ఏ చర్చికి వెళ్ళేదాన్ని కాదు. చింతల్‌లో ఉంటున్న మా చిన్నఅన్నయ్య(పరిశుద్ధరావుగారి)ద్వారా మేము మన ఎప్రాయిమినిస్ట్రీకి పరిచయమయ్యాము.

మా ఆయన మొదట్లో మమ్ములను చర్చ్‌కు వెళ్ళడానికి ఒప్పుకునేవారు కాదు, క్రమేపి మేము వెళ్ళడానికి అడ్డుచెప్పేవారు కాదు. తరువాత ఆయన కూడా అప్పుడప్పుడు వస్తూ ఉండేవాడు. అలా ఉంటుండగా ఒకసారి దసరాకి దేవత బ్యానర్ కట్టడానికి వెళ్ళాడు. అవన్నీ కట్టేసి ఒక బ్యానర్ మిగిలింది అని ఇంటికి తీసుకొచ్చి పెట్టాడు. ఆ రాత్రి ఆయన పడుకుంటే

 ఆలోచించకుండా నిర్ణయం తీసుకోకూడదు అది అనేక బాధలకు కారణమవుతుంది.

ఆ దేవత కలలోకి వచ్చి నిన్ను మింగేస్తా, చంపేస్తా అని ఆయనని నోటి దగ్గర పెట్టుకుని, నిన్ను చంపేస్తా అని అంటూ ఆ రాత్రంతా పదేపదే అదే కల వచ్చి ఆయనని భయ పెట్టింది. ఆ భయంతో వణికిపోయి నిద్రపోకుండా తెల్లవార్లు కూర్చునే ఉన్నారు. ఆ తరు వాత రాత్రి కూడా భయమేసి చింతల్‌లో ఉన్న మా అన్నయ్య వాళ్ళ ఇంటికొచ్చి పడుకున్నాం. ఆ తరువాత రోజు ఆదివారం బ్రదర్‌తో(దైవసేవకులు) ప్రార్థన చేయించుకుని, చర్చిలో పడు కుంటామని అడిగితే అప్పుడు దైవసేవకులు చర్చ్‌లో ఏమీ ఉండదు. మీ హృదయంలో నుంచి భయమును తీసివేయండి ప్రార్థన చేసాం కదా ఇంక భయపడకండి అన్నారు. అప్ప టినుండి మళ్ళీ ఎప్పుడూ ఆ కల రాలేదు, అలా ఆయన కూడా చర్చ్‌కి వస్తూ మారు మనస్సు పొందారు. 2010వ సం॥రం డిసెంబర్ నెలలో మేమిద్దరం బాప్తీస్మము తీసుకున్నాము. మా ముగ్గురు పిల్లలు కూడా మారుమనస్సు పొంది 2011వసం॥రంలో బాప్తీస్మము తీసుకు న్నారు. ఇలా ఉండగా మావారికి పక్షవాతం రావడం వలన గవర్నమెంట్ హాస్పటల్‌లో జాయిన్ చేశాము. డాక్టర్లు ఆపరేషన్ చేయాలి, చేసినా కాని చాలా రోజుల వరకు నడవలేదు అన్నారు, కానీ ఏ ట్రీట్మెంట్ మొదలుపెట్టలేదు. ఎవరూ పట్టించుకోక పోవడంవలన రోజు రోజుకి ఆయన పరిస్థితి క్షీణించిపోతుంది,ఇంక నేను చనిపోతాను మీరందరూ జాగ్రత్త అని ఆయన చెప్పేవారు, మాకు భయం వేసేది. త్వరగా ఆపరేషన్ అవ్వడానికి దేవుడు కృప చూపించి బ్రతికించారు, 2రోజుల్లో లేచి నడవడానికి దేవుడు సహాయం చేశారు.

ఆత్మీయ జీవితంలో ఎలా నడుచుకోవాలో బ్రదర్ చేప్పే వాక్యాల ద్వారా తెలుసుకొని బల పరచబడ్డాను. నా ముగ్గురు పిల్లల వివాహ విషయంలో దేవుడు గొప్ప కార్యము చేశారు. ఈ రోజున నేను నా కుటుంబం సంతోషంగా, ఆనందంగా దేవునిలో కొనసాగుతున్నామంటే అది దేవునియొక్క మహాకృపా, దైవసేవకులు చెప్పే వాక్యాలు, సంఘం చూపించే ప్రేమ, ఆప్యాయతలు మాత్రమే కారణమని నేను చెప్పగలను. నా ఈ చిన్న సాక్ష్యమునుబట్టి దేవుని నామము మహిమపరచబడాలని కోరుకుంటున్నాను.

# ఆరోగ్య విభాగము

## అంశం :
## యాంటీబాడీస్ నీ శరీరములో ఎలా పెరుగుతాయి

- తిప్పతీగ మీ శరీరములో యాంటీబాడీస్‌ను డెవలప్ చేస్తాయి.
- యాంటీబాడీస్ శరీరములో అధిక సంఖ్యలో ఉంటే, మీ శరీరం లోపలకి చొరబడిన వైరస్‌ను కనిపెట్టి, వేరే కణాలకు సమాచారం ఇవ్వడం ద్వారా అవి వచ్చి వైరస్‌ను సమూలంగా నాశనం చేస్తాయి.
- ప్రతిరోజు తిప్పతీగ 4 లేక 5 ఆకులు నూరి ముద్దగా లేదా పసరు తీసి తేనె కలిపి త్రాగవచ్చును
- ప్రతిరోజు తిప్పతీగ 4 లేక 5 ఆకులు అరలీటరు నీటిలో, పావులీటరు అయ్యేవరకు మరిగించి కషాయంగా త్రాగాలి
- నేరుగా త్రాగలేనివారు నిమ్మరసం తేనె కలిపి త్రాగవచ్చును.

### కాలేయం ప్రాముఖ్యత మరియు ఎలా కాపాడుకోవాలి

- గుండె, కిడ్నీ ఫెయిల్ అయితే కృత్రిమ గుండెను కిడ్నీని అమర్చవచ్చును.
- లివర్ ఫెయిల్ అయితే మనిషి బ్రదకడం చాలా కష్టం.
- ఆల్కహాల్, పొగ, చల్లని పానీయాలు, ఐస్ క్రీమ్స్, ప్రిజర్వేటివ్ కలర్స్ ద్వారా వచ్చే ప్రమాదాలు రాకుండా లివర్ కాపాడుతుంది.
- పురుగు మందులు వాడి పండించిన పంటలు, కార్బైడ్‌తో పండించిన పండ్లు తినుట ద్వారా కలిగే నష్టాలను లివర్ శుద్ధి చేసి మనలను కాపాడుతుంది.
- ఆరోగ్యానికి సంబంధించిన మందులు, సిరప్, ఇంజెక్షన్లు వాడకం ద్వారా ప్రవేశించే రసాయనాలు మన మీద ప్రభావాన్ని చూపకుండా లివర్ కాపాడుతుంది.

- ఆయిల్ ఫుడ్ ఎక్కువ తినడం వలన శరీరానికి నష్టం కలగకుండా లివర్ కాపాడుతుంది.
- శరీరములో ఉన్న చెడు కొలెస్ట్రాల్ అంతటిని శుద్ధి చేయడానికి లివర్ ఎంతో దోహదపడుతుంది.
- ఇన్ని ప్రమాదాలు నుండి కాపాడే ఆ లివర్‌ను ఎలా నీవు కాపాడుకోవాలి.
- రెండే రెండు మార్పులు నీ దినచర్యలో చేసుకుంటే నీ లివర్‌ను చక్కగా కాపాడుకోవచ్చు.
- రాత్రి 7లోపు నీవు డిన్నర్ ముగించాలి. అది రాత్రి 11లోపు జీర్ణం అవుతుంది. తద్వారా శరీరానికి విశ్రాంతి కలుగుతుంది. తద్వారా శరీరములో ఉన్న సమస్యలను లివర్ దానంతట అదే రిపేర్ చేసుకుంటుంది.
- డిన్నర్‌లో కూడా పండ్లు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండాలి.
- వారానికి ఒక్కసారైనా తేనె, నిమ్మరసం నీరు రోజంతా తీసుకుని ఉపవాసం ఉండటం చాలా ముఖ్యమైన సంగతి.
- లివర్‌కి ఎంత విశ్రాంతి ఇస్తే అంత ఆరోగ్యంగా ఉంటుంది.
- లివర్‌ను నువ్వు కాపాడితే అది నిన్ను కాపాడుతుంది.

**దేవుడు మీకు మంచి ఆరోగ్యం దయచేయును గాక!**



# మనస్థత్త్వపు విధానములు

## విశ్వాసపు మనసు

(గతి సంచిక తరువాయి భాగం)

అనేకులు దేవునిని నమ్మకపోవటానికి కారణమేమిటంటే వారికి దేవుడు కనబడడు కాబట్టి వారు నమ్మరు. కానీ విశ్వాసమనేది కనబడేదానికి సంబంధం లేనిది. చూసిన దానిని నమ్మే వాళ్ళు విశ్వాసంలేనివారు, వారు తమ జీవితంలో చాలా నష్టపోతారు. నువ్వు జీవించే జీవితం విశ్వాసమునుబట్టి జీవిస్తున్నావా? లేక విశ్వాసంలేకుండా జీవిస్తున్నావా? ఆలోచించుకో! విశ్వాసానికి ఉన్న ఆధిక్యత మరి దేనికీ కూడా లేదు.

**"విశ్వాసమునుబట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతోపాటు నశింపకపోయెను." హెబ్రీ 11:31**

యెహోషువా ఒక దేశమునకు కొంతమంది వేగులవారిని పంపించినప్పుడు, అక్కడ రాహాబు అనే వేశ్య ఆ వేగులవారిని చేర్చుకొని వారికి ఆశ్రయమిచ్చింది. వారిని ఆ దేశములో ఉన్నవారెవరైనా కనిపెడితే ఖైదీలుగా ఉంచుతారు. అయినా విశ్వాసమునుబట్టి రాహాబు వారిని చేర్చుకొంది.

**"ఆ వేగులవారు పండుకొనకమునుపు, ఆమె వారున్న మిద్దెమీదికెక్కి వారితో ఇట్లనెను. యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడనియు, మీవలన మాకు భయముపుట్టుననియు, మీ భయమువలన ఈ దేశనివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీరు ఐగుప్తు దేశములోనుండి వచ్చినప్పుడు మీ యెదుట యెహోవా యెఱ్ఱసముద్రపు నీరును ఏలాగు ఆరిపోచేసెనో, యొర్దాను తీరముననున్న అమోరీయుల యిద్దరు రాజులైన సీహోనుకును ఓగుకును మీరేమి చేసితిరో, అనగా మీరు వారిని ఎలాగు నిర్మూలము చేసితిరో ఆ సంగతి మేము వింటిమి. మేము వినినప్పుడు మా గుండెలు కరిగిపోయెను. మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే. మీ యెదుట ఎట్టి మనుష్యులకైనను ధైర్యమేమాత్రము ఉండదు." యెహో 2:8-11**

రాహాబు ఇశ్రాయేలీయులపట్ల దేవుడు చేసిన కార్యాలను చూసి గుండెలనిండా విశ్వాసం కలిగి ఉంది. మనం ఎన్ని వాక్యాలు వింటున్నాము వింటున్న దానిని బట్టి విశ్వాసం కలిగి ఉంటున్నామా? రాహాబు అన్యురాలు, దేవునిని యెరుగని కుటుంబం, అయినప్పటికీ ఆమె విన్న మాటలనుబట్టి ఆమెకున్న విశ్వాసం ఏమిటంటే వారి దేవుడు తప్పకుండా ఈ దేశము ను వారికి ఇస్తాడు. అనేక శత్రుసైన్యముల ఎదుట జయమిచ్చి వారిని నడిపిస్తున్నాడు. కాబట్టి ఇక్కడ కూడా వారికి జయమిస్తాడు అని విశ్వసించింది. మనం వాక్యాన్ని విని విడిచి పెట్టి

 కష్టంలో ఉన్నప్పుడు అవకాశం కోసం చూడు కానీ అంది వచ్చిన అవకాశంలో కష్టాన్ని చూడకు.

జీవించకూడదు. విశ్వాససంబంధుల యొక్క మాటలు, వారియొక్క ఆలోచనా విధానము, వారి ధైర్యము, నడవడిక ఇతరులకు పూర్తి వేరుగా ఉంటాయి. రాహాబు దేవునిని ఎరుగలేదు కాబట్టి అవిధేయురాలైనప్పటికీ విశ్వాసంతో ఉండటం వలన విధేయురాలిగా మార్చబడి, నీతిమంతురాలుగా తీర్చబడింది. కావున ఆమె అవిధేయులతోపాటు నశించ లేదు. తాను మాత్రమే కాకుండా తన ఇంటివారిని కూడా కాపాడుకోగలిగింది. రాహాబు తన ఇంటివారందరికి క్షేమాన్ని తెచ్చిపెట్టింది. నీ కుటుంబములోనివారు విశ్వాసం గలవారుగా లేరేమో, కానీ నువ్వు విశ్వాసం కలిగి ఉండి నీ కుటుంబమును కాపాడుకో.

**“మీరువేకువనే లేచి చాలరాత్రియైన తరువాత పండుకొనుచు కష్టార్జితమైన ఆహారము తినుచునుండుట వ్యర్థమే. తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారి కిచ్చుచున్నాడు.” కీర్తన 127:2**

విశ్వాససంబంధులు ఎప్పుడూ దేవుని నిర్ణయమే నా జీవితంలో జరుగుతుంది కనుక నరమాత్రులు నన్నేమీ చేయలేరు అని సింహమువలె ధైర్యముగా ఉంటారు, ప్రశాంతంగా నిద్రపోతారు.

దేవుడు మనకు ఏదైనా ఇవ్వాలి అని అనుకుంటే ఆయన ఏదో ఒక విధంగా ఇస్తాడు. విశ్వాస సంబంధులకు ఇతరుల నుండి ఏది ఆశించే మనస్సు ఉండదు.

**“ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలను వారిని గూర్చియు, ప్రవక్తలనుగూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసముద్వారా రాజ్యములను జయించిరి; నీతికార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్లను మూసిరి; హెబ్రీ 11:32,33**

నువ్వు విశ్వాసంగలవాడివి అయితే ధనాపేక్షను, స్వార్థాన్ని, నిన్ను దూషించే వారిని, నిన్ను అవమానించేవారిని, నీ శత్రువులను ఇలా దేనినైనా జయించగలుగుతావు. ఈ విశ్వాసము ద్వారానే మన పితరులు రాజ్యమును జయించారు. విశ్వాసం కలిగిన వారికి జయం తప్పకుండా వస్తుంది. మన జీవితంలో జయం కోసం కుట్రలకు, కుయుక్తులకు చోటు ఇవ్వకూడదు. విశ్వాసం కలిగినవారు ఎప్పుడూ కుట్రలకు దూరంగా ఉంటారు.

**ఇంకా ఉంది**

# దైవ చిత్తాన్వేషణ

-యౌవనుల ప్రత్యేకము (సేకరించబడింది)

దేవుని చిత్తము కనుగొనాలని దేవుని యొద్దకు వచ్చు అనేకమంది వారు ముందే ఏర్పరచు కొన్న తమ నిర్ణయాలకు, మార్గములకు ఆయన ఆమోదం కోసం మాత్రమే వస్తారు. కావున వారు ఆయన యొద్దనుండి ఎటువంటి జవాబును పొందలేరు. **"ప్రభువా నీవు ఇది నీ చిత్తము అని నాకు నిశ్చయత కలుగజేసినట్లయితే, నేను దేనినైనా అంగీకరించుటకు సిద్ధముగా ఉన్నాను. నా ప్రభువా, నా కొరకు నీవే ఎంపిక చేయి. ఈ విషయములో నాకు ఎటువంటి ఎంపిక లేదు"** అని చెబుతూ ఎటువంటి రిజర్వేషన్(షరతు) లేకుండా మనము ప్రభువుకు అప్పగించుకొనినట్ల యితే, ఎంత త్వరగా మన నడిపింపునకు గల సమస్యలు పరిష్కారమవుతాయో కదా! దేవునికోసం ఏ సమయములోనైనా, ఎక్కడికైనా, ఏదైనా చేయగల అబ్రాహాము సిద్ధపాటే **"దేవుని స్నేహితుడు"**గా అతనిని చేసినది.

బ్రిస్టర్ (ఇంగ్లాండ్) దేశస్థుడైన జార్జ్‌ముల్లర్ ఎంతో గొప్ప విశ్వాసం కలిగిన వ్యక్తి మరియు దేవునిచిత్తమును ఎంతో ఖచ్చితముగా నిశ్చయపరచుకునే వాడు. ఆయన ఈ విధముగా చెప్పాడు, "నేను దేవునిచిత్తము కొరకు చూస్తున్న విషయములో మొట్టమొదటగా నా హృద యమునకు తన స్వంత చిత్తము ఏమియు లేనటువంటి స్థితి వచ్చువరకు నేను చూస్తాను. మనుష్యులతో నూటికి తొంభై శాతం సమస్య ఇక్కడే ఉంటుంది. దేవుని చిత్తమేదైనా చేయుటకు ఎప్పుడైతే మన హృదయములు సిద్ధపడి ఉంటాయో అప్పుడు నూటికి తొంభై ఇబ్బందులు తొలగించబడతాయి. ఎప్పుడైతే నిజముగా ఇటువంటి స్థితిలో ఒక వ్యక్తి ఉంటాడో, సామాన్యముగా, ఆయన చిత్తమేదో తెలుసుకొనుటకు ఇది ఒక చిన్న మార్గము".

విధేయత చూపించాలా? లేదా? అని నిర్ణయించుకొనక మునుపే దేవునిచిత్తమును తెలు సుకొనవలెనని కొందరు కోరుకుంటారు. అయితే అటువంటి వారికి దేవుడు తన చిత్తమును బయలుపరచడు. **"ఎవడైనను ఆయన చిత్తమును చేయ నిర్ణయించుకొనిన యెడల...వాడు తెలిసికొనును"(యోహాను 7:17)**. దేవుడు ఆజ్ఞాపించునది ఏదైననూ సరే చేయుటకు మనకు కలిగిన సిద్ధపాటు మాత్రమే దేవుని పరిపూర్ణ చిత్తమేదో తెలుసుకొనుటకు అర్హతగా ఉండును. ఇది చిన్న మరియు పెద్ద విషయములకు కూడా వర్తించును.

**నూతన పరచబడిన మనసు :-**

**"మీరు ఈ లోకమర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి"(రోమా 12:2).**

 గెలవకపోతే వీడు మారడు అని, గెలిస్తే వీడు మా వాడు అనేది ఈ లోకం తీరు.

లోకత్వము మన ఆత్మ యొక్క చెవులను మూసివేసి మనలను దేవుని స్వరము వినకుండా చేస్తుంది. ఈ లోకంలో జీవిస్తున్న ప్రతి వ్యక్తి కూడా ఈ లోకాత్మచేత ప్రభావితం చేయబడ తాడు. దాని ప్రభావము నుండి ఎవరూ తప్పించుకోలేరు. మనము విన్నదాన్నిబట్టి, చూచిన దాన్నిబట్టి మరియు చదివిన దాన్నిబట్టి మన చిన్నతనము నుండే మనలో ప్రతి ఒక్కరము ఈ లోకపు ఆత్మను దినదినము ఎంతో ఇముడ్చుకుంటాము. ప్రత్యేకముగా ఇది మన మనస్సుల మీద ప్రభావము చూపుతుంది. మరియు మన ఆలోచనా విధానమును కూడా ప్రభావితము చేస్తుంది. అప్పుడు మనము ప్రాథమికముగా ఈ లోకములోని విషయములను పరిగణన లోనికి తీసుకొని నిర్ణయాలు తీసుకుంటాము.

**"క్రొత్తగా జన్మించినప్పుడు"** మనలో నివసించుటకు వచ్చిన దేవుని ఆత్మ ఈ లోకపు ఆత్మకు విరోధముగా ఉంటాడు. కాబట్టి మన ఆలోచనా విధానమును పూర్తిగా నూతన పర చాలని కోరుకుంటున్నాడు. ఆయన కుమారుని యొక్క స్వారూప్యములోనికి మారడమే మన యెడల దేవునికి ఉన్న అంతిమ ఉద్దేశ్యము. ఇది మనందరి కొరకైన ఆయన చిత్తములోని ప్రాథమిక భాగము. మిగిలినదంతా -అనగా మనము ఎవరిని వివాహము చేసుకోవాలి, మనము ఎక్కడ నివసించాలి మరియు ఎక్కడ పని చేయాలి అనేది రెండవది. మనము యేసు వలె మారుటకు-దేవుడు మనలను నిర్వహించే విషయములన్నీ దీనికొరకే **(రోమా 8:28,29)** అయితే మన మనస్సులను పరిశుద్ధాత్మ అనుదినము రూపాంతరము చెందించుటకు మనము అనుమతిస్తేనే ఇది నెరవేర్చబడుతుంది. ఈ విధముగా ఎంతైతే మన మనస్సులు రూపాంతరము చెందుతాయో అంత ఖచ్చితముగా జీవితము యొక్క కూడలి (క్రాస్ రోడ్స్)లో దేవుని యొక్క చిత్తమును మనము వివేచించగలము.

లోకత్వము అంటే ఏదో బాహ్యముగా చేసేది కాదు అంటే సినిమాలకు వెళ్ళడం, ఆల్కాహాల్ త్రాగడం, పొగత్రాగడం, ఖరీదైన మరియు ఫ్యాషన్‌గా ఉండే దుస్తులు ధరించడం, మరియు బంగారు నగలు ధరించడం లేక దుబారాగా జీవించడం. ఇవి ఒక లోక సంబంధ మైన వ్యక్తిని వ్యక్తపరచ వచ్చును గాని, తన లోకపు ఆలోచనా విధానమునకు బాహ్య సంబం ధమైన వ్యక్తీకరణ మాత్రమే. ఈ లోక మర్యాదను అనుసరించుటమనేది ముఖ్యముగా ఒక వ్యక్తి యొక్క మనస్సులో ఉంటుంది, ఇది అనేక మార్గాలలో కనబడుతుంది.

**సేకరించబడింది**

**ఇంకా ఉంది**

# Finding God'S Will

**Youth Special (sourced)**

Many who come to God under the pretext of wanting to know His will really want only His approval of the path they have already chosen for themselves. Hence they receive no answer from Him. How soon our problems of guidance would be solved, if only we gave ourselves without any reserve to our Lord saying,

> "Lord, I am willing to accept anything, if Thou wilt only assure me that it is Thy will. Choose Thou for me, my Lord. I have no choice of my own in this matter."

It was Abraham's willingness to go anywhere and to do anything at any time for God that made him the "Friend of God."

George Muller of Bristol (England) was a man of great faith and one who could ascertain the will of God with remarkable accuracy. He has said in this connection,

> "I seek at the beginning to get my heart into such a state that it has no will of its own in regard to a given matter. Nine-tenths of the trouble with people is just here. Nine-tenths of the difficulties are overcome when our hearts are ready to do the Lord's will, whatever it may be. When one is truly in this stage, it is usually but a little way to the knowledge of what His will is."Some want to know God's will first before deciding whether to obey or not. But God does not reveal His will to such people. Jesus said,

> If any man desires to do His will, he will know.... （John 7:17）.

A willingness to do anything that God commands will alone qualify us to know what His perfect will is. This applies to small matters as well as big.

## A Renewed Mind

Do not be conformed to this world ....But be transformed by the (entire) renewal of your mind - by its new ideals and its new attitude - so that you may prove (for yourselves) what is the good and acceptable and perfect will of God(Romans 12:2.

Worldliness plugs our spirit's ears preventing us from hearing God's voice. Every person living in this world is affected by its spirit. No one has escaped its influence. From our childhood every one of us imbibes, day by day, either more or less of the spirit of this world into himself - by what we hear, see and read. This especially affects our minds and influences our thinking. The decisions we take then come primarily from worldly considerations.

The Spirit of God Who comes to live in us, when we are "born again" is opposed to the spirit of this world and therefore desires to renew our thinking completely. God's ultimate purpose for us is that we might be conformed to the image of His Son.

This is the primary part of His will for all of us. Everything else - whom we should marry, where we should live and work - is secondary. All of God's dealings with us are directed towards this end - that we might become like Jesus (see Romans 8:28,29 ). But this can be fulfilled in us only as we allow the Holy Spirit to renew our minds daily. The more our minds are thus renewed, the more accurately shall we be able to discern the will of God at life's crossroads.

**To be continued**




# బైబిల్ క్విజ్ -94

(అపొ. కార్యము నుండి )

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఏ ద్వీపంలో ఓడ ప్రమాదం నుండి పౌలు, ఇతరులు తప్పించుకొన్నారు?

**2.** ఇంత సులభంగా “నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావా?” అని ఎవరు ఎవరితో అన్నారు?

**3.** పౌలు నుండి తనకు డబ్బు (లంచం) వస్తుందని ఆశించి పౌలుతో మాటిమాటికి మాట్లాడిన అధిపతి ఎవరు?

**4.** కైసరయ పట్టణంలో ఎవరి ఇంట్లో పౌలు గడిపాడు?

**5.** పట్టణం విగ్రహాలతో నిండి యుండుట చూసినందున ఎక్కడ పౌలు ఆత్మ పరితాపం చెందింది?

**6.** ‘వీరు థెస్సలోనీకలో ఉన్న వారికంటే ఘనులైయుండిరి’ ఎవరువారు?

**7.** ఎక్కడ వాక్యాన్ని చెప్పవద్దని పరిశుద్ధాత్ముడు పౌలును ఆటంకపరిచాడు?

**8.** తిమోతి స్వస్థలం ఏది? అక్కడ పౌలు ఎవరికి సున్నతి చేయించాడు?

**9.** అపోస్తులులలో మొదటి హతసాక్షి ఎవరు? అతనిని చంపిందెవరు?

**10.** మొదటి క్రైస్తవ హతసాక్షి ఎవరు? అతని చావుకు సమ్మతించింది ఎవరు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జూన్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై 2024 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**<u>బైబిల్ క్విజ్ – 93 జవాబులు :(యోహాను సువార్త నుండి)</u>**

**1**. పేతురుని మూడుసార్లు అడిగాడు **(21:15,16)**

**2.** కయప **(18:14)**

**3.** పిలాతు **(18:31)**

**4.** అధికారులు **(12:42,43)**

**5.** మార్త యేసుతో చెప్పింది **(11:22)**

**6.** తోమా **(11:16)**

**7.** దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను **(3:16)**

**8.** నతనయేలుని గురించి యేసు చెప్పెను **(1:47)**

**9.** నికోదేము యేసుని అడిగాడు**(3:4)**

**10.** **38**సంవత్సరములు **(5:5)**

**<u>బైబిల్ క్విజ్ – 93 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

కె.గణేష్, రాజుఫ్లోరెన్స్, ఎమ్. మాధవి, కె. కృపావరం, నిస్సీజేమ్స్

 చెప్పేవాళ్ళు లేక చెడిపోవడం అనేది దురదృష్టం చెప్పేవాళ్ళు ఉండి కూడా చెడిపోవడం అనేది మూర్ఖత్వం.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "

## మే - జూన్

**భాగ్యలత :** మణి, మేరీరత్నం, గోపాలం, జయంతి, శిరీష, జగన్, అశోక్ కుమార్, సాయిలత, వెంకటేష్, రమేష్, భీమశంకర్రావు, అరుణకుమార్, జ్యోతి, సుజాత, శ్రీలత, మల్లిక, గ్లోరియరాజ్, శ్రీలక్ష్మి , రవితేజ, మధురిమ, సుశాంతి, హారిక, మార్త, శామ్యూల్, శారా, రాజేష్, గౌతమి, వాణి, నాగరాజు, సుధ, మాధవి, రూతు, సలోమి, మేఘన, బసవపూర్ణమ్మ, నవ్య, అంజలి, శేఖర్‌బాబు, సాయికుమార్, సద్గుణ, రఫీ, శారదకుమారి, దుర్గాప్రసన్న , జాన్, పాల్‌రాజ్, మేరీఫాతిమా, పూజ, అమలా జ్యోతి, ఆశ, ధన్యత, మానస, తిరుపతి, మనోజ్, జాషువా, ప్రవల్లిక, నితేష్, వీరలింగం, మధుసుదన్‌రెడ్డి, విజయనందన, నవ్యక, కృపాజ్యోతి, రామకృష్ణ , రాజేశ్వరి, మనూజ, జయరాజు, ఫిలిప్పు, మన్యం, గాయత్రి, సూర్యప్రభ, లక్ష్మి , గిద్యోను, ప్రీతి, దానియేల్, రోసీప్రకాష్, శాంతి, నందిని, ఫ్రాన్సెస్, నవీన, వెంకటేశ్వర్రావు, కౌముది, గీత, అవినాష్, వసంతరాణి, ఆనంద్‌రాజ్, నవీన, అనిత, గాయత్రి, శేషగిరి, విజయకుమారి, అగస్టీనా, హేమాంబరావు, కనకదుర్గ, గీతాసాత్విక, కిరణ్, ప్రశాంతి, అనిల్‌కుమార్, వినయ్‌కుమార్, మధుబాల, లావణ్య, విజయలక్ష్మి , ప్రియాంక, వివేక్, కృష్ణకళ్యాణ్, శ్రీను, వెంకట్, ఆదిలక్ష్మి, శైలేష్, సుబ్బారావు, జోజిబాబు, సంధ్యారాణి, లత, ఉమ, ప్రశంస, శేఖర్, మమత(సింగపూర్).

**చింతల్ :** విజయ, సాత్విక్, శామ్సన్, జగన్‌మోహన్‌రావు, సొలొమోన్, నిహారిక, కృపారాణి, జీవా, రమ్య, శ్రీనివాస్‌రావు, అనూష, ఐజక్‌కుమారి, లత, గోపిచంద్, రాధాకృష్ణ, బెంజిమెన్, అభిషేక్, వెన్నెల, బాబూరావు, ఆనంద్‌కుమార్, జాన్సన్, రవీందర్, ఎలిజబెత్, సునీత, సంధ్యారాణి, మల్లేశ్వరి, సురేష్‌బాబు, స్వర్ణలత, ప్రజ్ఞ, మరియ, దేవకిరణ్, విజయమ్మ , సురేంద్ర, వివేకవతి, నిర్మల, ప్రశస్థ, ఎస్తేరు రాణి, రూతమ్మ, జీవమణి, జగన్, విజయ్.

**ఆనాజ్‌పూర్ :** జీవన్‌కుమార్, స్టెల్లారాణి, సుజిత్‌కుమార్, బ్లెస్సీ, మహాలక్ష్మి , మెరీసియోనా, మృదుల, వినయ్, మరియమ్మ, ఆంద్రేయ, జోషువా, ప్రశాంతి, నరేష్, సుదినషారోన్, నరసింహ, రాజ్‌కుమార్, రత్నాకర్, విశేష, కారుణ్య.

**ఇ.సి.ఐ.యల్ :** విజయ్‌కుమార్.

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

2024, మార్చి 31 వ తేదీన జరిగిన ఈస్టర్ ఆరాధనలో
అనేకులు పాల్గొని దేవుని మహిమపరచుట జరిగినది.









**2024, మార్చి 29 వ తేదీన జరిగిన గుడ్ ఫ్రైడే ఉపవాస ప్రార్థనలో అనేకులు పాల్గొని దేవుని ఆరాధించుట జరిగినది.**






# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by: T. Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-5000070, Hyderabad.*
*Printed by*: Charisma Printers Pvt. Ltd, # 6-1-91/37-40, Sensation Theatre Road, Lakadi-ka-pool, Hyderabad (TS) 500004 | Editor: Bro. T.Epaphras